క్లుప్తంగా

క్రీడా సామగ్రి అందజేయండి



మంత్రి సత్యవతి రాథోడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచరూరల్: రాష్ట్రంలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు దుస్తులు, క్రీడా పరికరాలను సరఫరా చేయాలని, ఆశ్రమ పాఠశాలలోని సీఆర్‌టీ, పీఈటీలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర గిరిజన వ్యాయమ ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం హైదారాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వరరెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో భూక్యా రమేష్, డాక్టర్ వీరునాయక్, ఎ.నగేష్, బాలసుబ్రమణ్యం, బి.నెహ్రూ పాల్గొన్నారు.

వైద్య సౌకర్యాలు మెరుగుపర్చండి



వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ నాయకులు

ఇల్లెందురూరల్: రొంపేడు పీహెచ్‌సీలో సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యసిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మోతీలాల్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వైద్యాధికారులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికీ ప్రజలకు దోమతెరలు పంపిణీ చేయలేదన్నారు. పీహెచ్‌సీకి ప్రత్యేకంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేష్, రఘు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



సీహెచ్ నాగరాజు

పాల్వంచరూరల్: పాల్వంచ తహసీల్దార్‌గా సీహెచ్.నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చుంచుపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. పాల్వంచ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడవి సరస్వతి శాలువా కప్పి, గుప్పుగుచ్ఛం అందిజేసి సత్కరించారు.

ఆలయాల్లో ఘనంగా పూజలు



గణేష్‌టెంపుల్‌లో సామూహిక దీపారాధన

కొత్తగూడెంటౌన్: శ్రావణమాసం తొలి శుక్రవారం భక్తులు ఆలయాల్లో, ఇళ్లల్లోనూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం రైటర్ బస్తీలోని త్రిమాతా శక్తి పంచాయత క్షేత్రం, పాత కొత్తగూడెంలోని రామాలయంలో, విద్యానగర్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో, రామవరంలోని శ్రీసీతారామ హనుమాశ్శివాలయంలో, భజన మందిరంలోని ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పలు ఆలయాలు కిటకిటలాడాయి.

యోగా శిక్షణ తరగతులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. చాంపియన్స్‌గా బాలికల విభాగంలో శ్రీ లక్ష్మీసాహితి ప్రథమ, వేద సంహిత ద్వితీయ, అన్విత తృతీయ... బాలుర విభాగంలో రాధాకృష్ణ ప్రథమ, అనురాగ్ ద్వితీయ, నౌహిద్ తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, గొల్లపూడి జగదీశ్, సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ వైవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బీభత్సం

- నిత్యం ఇళ్లల్లోకి చొరబడి దాడి చేస్తున్న పరిస్థితి
- సంజయ్‌నగర్‌లో ఇంటికొకరికి వానరాల దాడిలో గాయాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



సంజయ్‌నగర్‌లో తిరుగుతున్న వానరాలు



పాల్వంచ: మున్సిపాలిటీలో నానాటికీ కోతుల బెడద పెరిగిపోతోంది. ఇళ్లల్లో చొరబడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. రోడ్డున వెళ్తున్న వారిపై, ఇళ్లల్లో ఉన్న వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. కోతుల గుంపు వచ్చినప్పుడు వెళ్లిపోయే వరకు ఇళ్లల్లో తలుపులు వేసుకుని బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి. కోతుల దాడిలో ఇప్పటికే పలువురు గాయపడ్డారు. ఇంటికొకరు బాధితులు ఉండటం గమనార్హం. స్థానికులు వానరాలతో ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు గాయపడిన సందర్భాలు అనేకం..

కోతులు గుంపులుగా వస్తున్నాయి. ముఖ్యంగా నవభారత్, సంజయ్‌నగర్ ఏరియాలో వానరాల బెడద మరింత ఎక్కువ. సంజయ్‌నగర్‌లో ఇటీవల కోతుల దాడులు బాగా పెరిగాయి. ఇళ్లల్లో చొరబడి వస్తువులను చెల్లాచెదురు చేయడం, తినే వస్తువులను డబ్బాలతో సహా లాక్కెళ్లిపోతున్నాయి. ఇంటి యజమానులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. కోతుల దాడిలో ఇటీవల తోట వెంకటలక్ష్మి, సుశీలమ్మ, భార్గవ్‌కృష్ణ, ఎర్రంశెట్టి శంకరయ్య, ధనుష్, శ్రీ సాయికుమార్, ముగితే స్వాతి, దేవానంద్, నర్సింహారావు, కల్లోజి నిర్మల, తంబేల్ల రవి, రాసూరి కృష్ణ, యాదగిరి, కోటేశ్వరి ఇలా అనేకమంది బాధితులు ఆస్పత్రిలో పాలయ్యారు. కోతుల బెడద నుంచి రక్షించాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు.

కోతుల బెడద అధికంగా ఉంది



ఇటీవల సంజయ్‌నగర్ కాలనీలో కోతుల బెడద అధికంగా ఉంది. కోతులు రోజూ వచ్చి నానా బీభత్సం చేస్తున్నాయి. ఇళ్లల్లో చొరబడి తిష్ట వేస్తున్నాయి. వస్తువులను చిందరవందర చేసి లాక్కెళ్లిపోతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – భార్గవ్‌కృష్ణ, సంజయ్‌నగర్

ఇంటికొకరు గాయపడ్డారు



కోతుల దాడిలో ఇంటికొకరు గాయపడిన వారు ఉన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు భయాందోళనకు గురి కావాల్సి వస్తోంది. పలువురు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. బయటకు రావాలంటే కోతులు ఉన్నాయో లేదో చూసుకుని రావాల్సి వస్తోంది. – అంకెపాక ముత్తయ్య

అధికారులు చర్యలు తీసుకోవాలి



కోతుల బెడద వల్ల ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసాం. అయినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వానరాల నుంచి రక్షించాలి. చిన్న పిల్లలు బాగా భయపడుతున్నారు. చేతిలో ఏ వస్తువు పట్టుకుని బయటికి వెళ్లలేకపోతున్నాం. – స్వాతి

5కే రన్‌ను విజయవంతం చేద్దాం..



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

ఇల్లెందురూరల్: శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఓటర్ల చైతన్యం, ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియపై ప్రజల్లో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఇల్లెందులో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 5కే రన్ విజయవంతం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన వినూత్న కార్యక్రమాలపై చర్చించారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, యువత, ప్రజాప్రతినిధులు విధిగా 5కే రన్‌లో పాల్గొనేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ రన్‌లో ఆసక్తి కలిగిన ప్రతిఒక్కరూ పాల్గొనాలని తహసీల్దార్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ బాలరాజు, మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి, ఏఓ సతీష్, ప్రధానోపాధ్యాయుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పవన్‌కుమార్

జూలూరుపాడు: సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన ఎస్ఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పని చేస్తున్న పలువురు ఉపాధ్యాయులు ఏజెన్సీ అలవెన్స్ తీసుకుంటూ స్థానికంగా నివాసం ఉండకుండా ఖమ్మం, కొత్తగూడెం పట్టణాల నుంచి ఇష్టం వచ్చిన సమయానికి పాఠశాలకు వస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విధులను సక్రమంగా నిర్వర్తించని ఉపాధ్యాయులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం డివిజన్ అధ్యక్షుడు బోడా అభిమిత్ర, పవన్, వంశీ, సాయి, శరత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షకులు, అభ్యర్థులకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి ఉద్యోగుల భార్యలకు, పిల్లలకు, పరిసర ప్రాంతాల నిరుద్యోగ మహిళలకు నిర్వహించే వివిధ వృత్తి శిక్షణ కోర్సులు.. ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం, ప్రీ ప్రైమరీ టీచర్ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సుల్లో మూడు నెలల కాల పరిమితి కొరకు శిక్షణ ఇచ్చేందుకు అనుభవం, అర్హత కలిగిన శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ఆర్సీ) కే.బసవయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దీంతోపాటు ఆయా కోర్సులు నేర్చుకునేందుకు ఆసక్తి కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం హైదరాబాద్ వారిచే సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు 26వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయ పోస్టులకు...

పాల్వంచరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు పార్ట్‌టైం ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలపల్లి గురుకులంలో ఇంగ్లిష్ లెక్చరర్, ఇల్లెందులో పీజీటీ టీచర్ పార్ట్‌టైం పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు సోమవారం పాల్వంచ మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో నిర్వహించే డెమోకు నేరుగా హాజరు కావాలని కోరారు.

లాంగ్‌టర్మ్ కోచింగ్ దరఖాస్తులకు నేడు చివరి గడువు..

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో జేఈఈ, ఐఐటీ, నీట్‌లో శిక్షణ పొందడానికి నిర్వహించే లాంగ్‌టర్మ్ కోచింగ్ దరఖాస్తులకు శనివారం చివరి గడువు అని ఆర్‌సీఓ ప్రత్యూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా పాపన్న గౌడ్ జయంతి

బహుజనుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిలుస్తారని పలువురు వక్తలు అన్నారు. పాపన్న జయంతిని శుక్రవారం కొత్తగూడెం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్న కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



చుంచుపల్లి: పూలమాల వేస్తున్న రంగాకిరణ్



కొత్తగూడెంఅర్బన్: పాపన్న జయంతి కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు



పాల్వంచరూరల్: నాగారం గ్రామంలో...

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

చుంచుపల్లి: ఇంటర్‌లో ఎక్కువ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు ఈ నెల 20న విద్యానగర్‌లోని హనుమత్ సేవా సదన్‌లో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు మాస్టర్ మైండ్స్ కోచింగ్ నిర్వాహకులు ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఎంపీసీలో 430, బైపీసీలో400, ఎంఈసీలో 470, సీఈసీలో 450 పైన మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. వీరికి రివార్డుతో పాటు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 8978480385, 9100024046 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సుజాతనగర్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్, వేపలగడ్డ, రాఘవాపురం, సింగభూపాలెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, రూప్లాతండా, మేడేపల్లి, చింతలతండా, మంత్రితండా, నిమ్మలగూడెం, బేతంపూడి, జామ్లా తండా, సీతంపేట, సీతంపేట బంజర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: భూ వివాదంలో జామాయిల్ మొక్కలను ధ్వంసం చేసిన నలుగురిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ.కార్తీక్ తెలిపిన వివరాలు.. ప్రభాత్‌నగర్ గ్రామానికి చెందిన కల్లెం వీరారెడ్డి సాగు భూమిలోని 15,500 జామాయిల్ మొక్కలను అదే గ్రామానికి చెందిన సైరెడ్డి దేవేందర్‌రెడ్డి, నిమ్మల సంపత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి ట్రాక్టర్ డోజర్ ద్వారా ఈనెల 6వ తేదీ రాత్రి ధ్వంసం చేసి నష్టం కలిగించారని బాధిత రైతు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్ పరిధి కొత్తూరు గ్రామంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి లోపల, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, దోమల వృద్ధి చెందకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, ఏఎన్ఎం వెంకటముత్యం, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

దేశంలోనే నంబర్ వన్ తెలంగాణ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే వనమా, నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లిలోని పేదలు 100 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. రూ.మూడువేల కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.

రైల్వే బాధితులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం...

రైల్వే స్టేషన్ సమీపంలో గతంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు స్థానిక హెడ్డాఫీసు ఏరియాలో స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని, ఎవరూ కూడా అధైర్య పడవద్దని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం రైల్వే స్టేషన్ దగ్గర ఇళ్లు కోల్పోయిన బాధితులు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఏ వర్గానికి అన్యాయం చేయదన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జేవీఎస్ చౌదరి, భూక్యా రాంబాబు, మండే హనుమంతరావు, బత్తుల వీరయ్య, నిమ్మకాయల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ బీఆర్ఎస్



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ప్రజా సంక్షేమానికి కేరాఫ్ బీఆర్ఎస్ అని ప్రజలంతా బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని 16వ వార్డులో సుమారు 100 మంది పార్టీలో చేరారని, వారందరికీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. మునుపెన్నడూ జరుగనంత అభివృద్ధి, సంక్షేమం ఇల్లెందులో జరిగిందని, ఆకర్షితులైన ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇల్లెందు రూపురేఖలు మార్చాలని తలంచామని, ఆ దిశగా తమ పయనం సాగుతోందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కౌన్సిలర్ గిన్నారపు రజిత, తార, యలమద్ది రవి, కృష్ణారావు, నబీ, గిన్నారపు రవి, హరికృష్ణ, పోషం, చాంద్‌పాషా, శ్రీరామ్, నీలం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

మహాత్మ జ్యోతీరావు పూలే కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడ్డారని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని జేకే కాలనీలో సింగరేణి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, టీజీబీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, పంజాల శ్రీనివాస్, పులి పూర్ణచందర్, కోట సాంబయ్య, యాదగిరి, మాధవ్, తార, యలమద్ది రవి, కృష్ణారావు, గిన్నారపు రాజేష్ పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్



కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న కనకయ్య

ఇల్లెందు: టీపీసీసీ పిలుపు మేరకు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ప్రారంభించారు. ఇల్లెందులోని జేకే కాలనీ హరిహర క్షేత్రం, 5వ వార్డులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం పూజలు చేశాక ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను అధికారంలోకి వస్తే రూ.500 గ్యాస్ సిలిండర్ ఇవ్వడమే కాక స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు డి.డానియేల్, పి.సైదులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సుదర్శన్ కోరి, పత్తి స్వప్న, శ్రీను, మసూద్, వీరూ, జే.వీ.భద్రం, వెంకటనారాయణ, మహబూబ్, సైదుమియా, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, బోగ నందకిషోర్, స్వాతి, చుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇప్పటికే ఒకవైపు కాంగ్రెస్ ఆశావాహ అభ్యర్థులు డాక్టర్ జి.రవి, సీతంపేట ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి, చీమల వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి తదితరులు కూడా ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో నిమగ్నం కాగా, ఇప్పుడు కనకయ్య రంగంలోకి దిగారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సుజాతనగర్: మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి



జూలూరుపాడు: హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లావుడ్యా సోనీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ఉపాధి కూలీల వేతనాలు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారులకు అధికారులు పలు ధ్రువీకరణ అడుగుతున్నారని వాటిని జారీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శారదను చింతలతండా సర్పంచ్ భూక్యా రాములు కోరారు. ఎంపీపీ లావుడ్యా సోనీ మాట్లాడుతూ.. మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. 24 మంది సర్పంచ్‌లకు గాను ఐదుగురు మాత్రమే హాజరు కాగా, నలుగురు ఎంపీటీసీలు, ఒక కోఆప్షన్ సభ్యుడితో పాటు, పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

సుజాతనగర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 17వ పాలకమండలి సభ్యుల సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి 22 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా.. పలువురు గైర్హాజరయ్యారు. ప్రజాప్రతినిధుల్లో నలుగురు ఎంపీటీసీలు, నలుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. కొన్ని శాఖల అధికారులు సమావేశం ప్రారంభం అయ్యాక రావడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు గైర్హాజరు కావడం సరైంది కాదన్నారు. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, సీడీపీఓ స్వర్ణలత లెనీనా, ఏపీఎం మీరాంబి, ఏఓ నర్మద, ఎంఈఓ జుంకీలాల్ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కల్వర్టు.. యమడేంజర్

టేకులపల్లి మండలం తడికలపూడి పంచాయతీ లక్ష్మీపురం - తడికలపూడి మధ్య కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సంవత్సరాల తరబడి శిథిలమవుతూ వస్తోంది. టేకులపల్లి నుంచి ఖమ్మం వెళ్లేవారు ఈ కల్వర్టు మీద నుంచే వెళ్లాలి. రాత్రివేళలో కూడా అనేక మంది కార్లు, బైక్‌లు, ఆటోల్లో ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. వాహనాలు ధ్వంసం కూడా అయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : నవీన్, పీఆర్‌ఏఈ, టేకులపల్లి
సెల్ నెంబర్: 94918 92421